
సాక్షి
పల్నాడు
గురువారం । 11 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.90 అడుగుల వద్ద ఉంది. ఇది 152.7628 టీఎంసీలకు సమానం.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.



మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడలో జరిగే చండీ రుద్ర రాజ శ్యామల మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు.

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు 84.63 శాతం హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 సజావుగా జరిగింది. గుంటూరు నగర పరిధిలోని వివిధ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 5,409 మంది విద్యార్థులకు గాను 4,578 మంది హాజరయ్యారు. 84.63 శాతం హాజరు నమోదైంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగ్గా, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద విద్యార్థులకు తనిఖీలు నిర్వహించారు. హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్ మినహా ఇతర ఎటువంటి సామగ్రిని కేంద్రాల్లోనికి అనుమతించలేదు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాలిసెట్–2023 గుంటూరు జిల్లా సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు లీగల్: ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, సివిల్ దావాలు, బ్యాంకు, రెవెన్యూ, బీమా, భూ సేకరణ, వివాహ సంబంధిత, మోటారు ప్రమాదాలు, ఎలక్ట్రిసిటీ, ప్రీలిటిగేషన్ తదితర కేసులు పరిష్కరించనున్నట్లు వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌తో అమూల్యమైన సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు.

యార్డులో 88,049 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 81,023 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,049 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,178 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జె.మోహనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో భాగంగా ఫిబ్రవరి 4న నిర్వహించిన సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలపై చర్చించి, ఆమోదిస్తామని తెలిపారు. కాగా మూడు జిల్లాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కానున్నారని తెలిపారు.

ఆరోగ్యమిత్రల ఎంపిక జాబితా విడుదల

గుంటూరు మెడికల్: ఆరోగ్య మిత్ర ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసినట్లు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైనవారి జాబితాను గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో guntur.ap. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

అర్ధరాత్రి హత్యల కలకలం

ప్రశాంతంగా ఉండే నరసరావుపేట పట్టణం జంట హత్యల ఘటనలతో తుళ్లిపడింది. సూర్యోదయంతోనే దారుణ హత్యల వార్త దావానలంగా వ్యాపించడంతో పట్టణంలో కలకలం రేగింది. ఒంటరిగా రోడ్ల పక్కన నిద్రించే వారినే లక్ష్యంగా చేసుకుని బండరాళ్లతో మోది భయానకంగా చంపిన తీరు విస్మయం కలిగించింది.. అయితే గంటల వ్యవధిలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

- యాచకులను లక్ష్యంగా చేసుకొని కొట్టి చంపుతున్న ఖైనం
- బండరాయితో మోది ఇద్దరి హత్య
- నరసరావుపేటలో ఘటనలు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విచారణలో వెలుగులోకి వచ్చిన మూడో హత్య



రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్న సంపత్‌రెడ్డి



హత్యకు గురై సంఘటనా స్థలంలో ఉన్న గుర్తు తెలియని యాచకుడు

నరసరావుపేట టౌన్: రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన జంట హత్యలు పట్టణంలో కలకలం రేపాయి. యాచకులను లక్ష్యంగా చేసుకొని అగంతకుడు దారుణ హత్యలకు పాల్పడ్డాడు. గంటల వ్యవధిలో కేసును చేధించి, నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డులో పద్మ పూజిత ద్విచక్రవాహన కన్సల్టెన్సీ దుకాణం వద్ద వరంగల్‌కు చెందిన సంపత్‌రెడ్డి(45) బుధవారం తెల్లవారు జామున దారుణ హత్యకు గురై కనిపించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహంపై గాయాలు ఉండటాన్ని గమనించారు. సమీపంలో సీసీ పుటేజ్ పరిశీలించగా మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సంపత్‌రెడ్డిపై బండరాయితో మోది హత్యచేసినట్లు గుర్తించారు. సంఘటనకు కూతవేటు దూరంలో ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి దుకాణ సముదాయం వెనుక భాగంలో మరో హత్య జరిగినట్లు తెలుసుకున్నారు. దీంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా నిద్రిస్తున్న గుర్తుతెలియని మరో యాచకుడిపై బండరాయితో దాడి చేసి హత్య చేసినట్లు గుర్తించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

సమాచారం అందుకున్న సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులు వైద్యశాలకు చేరుకున్నారు. ఇంట్లో అలిగి నాలుగు రోజుల క్రితం నరసరావుపేటకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసుల అదుపులో నిందితుడు...?

పట్టణంలో జంట హత్యల ఘటనలను సీరియస్‌గా తీసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అనుమానితుల్లో ఒకడైన పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్లపందిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో పోలీసులు విచారించటంతో కేసు చిక్కుముడి వీడింది. పై రెండు హత్యలు తానే చేసినట్లు నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. ఇద్దరిని హత్యచేసి వారి వద్ద నుంచి నగదు దోచుకొని వెళ్లినట్లు తెలియవచ్చింది.

వెలుగులోకి వచ్చిన మరో హత్య...

ఈ నెల 5వ తేదీన మార్కెట్ సెంటర్ సమీపంలోని సాంబశివ ఫర్నీచర్స్ వద్ద గుర్తుతెలియని మహిళ హత్య గావించబడింది. నిద్రిస్తున్న సమయంలో బండరాయితో మోది ఆమెను హత్య చేశారు. ఆమెను కూడా హత్య చేసింది తానేనని తన్నీరు అంకమ్మరావు ఒప్పుకోవడంతో పోలీసులు విస్తుపోయారు.

నిందితుడిపై 13కు పైగా కేసులు..

పోలీసుల అదుపులో ఉన్న తన్నీరు అంకమ్మరావుపై పల్నాడు జిల్లాతో పాటు వివిధ పోలీసు స్టేషన్‌లలో చోరీ, దోపిడీ కేసులు ఉన్నాయి. గత ఏడాది 5వ నెలలో గీతామందిర్ రోడ్డులో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళను హత్య చేసి ఆమె వద్ద నుంచి రూ.2.70 లక్షలు దోచుకుపోయాడు. ఆ కేసు నుంచి బయటకు వచ్చిన తర్వాత హత్యలకు పాల్పడ్డాడు. బుధవారం చోటుచేసుకున్న జంట హత్యల నిందితుడిని గంటల వ్యవధిలో పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి విడదల రజిని

- జగనన్న పాలనలో విద్య, వైద్యం, గృహాలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంత్రి రజిని ఇంటింటికి తిరుగుతూ ఏ కుటుంబానికి ప్రభుత్వ పథకాలతో ఎంత మేలు జరిగిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంట్లోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం విద్య, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ ని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16వేల కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. వార్డు కౌన్సిలర్ తోట నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, కార్యదర్శి మారుబోయిన నాగరాజు, నాయకులు తోట సురేష్, షేక్ ఖాదర్ జిలాని, ఇర్రి రాఘవ, ఎ.అమర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు బుధవారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. గుంటూరు మొహిద్దీన్ పాలెంకు చెందిన కె. దుర్గరావు, ఉమాశైలజ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు.

మెగా టూరిజం భూముల పరిశీలన



మెగా టూరిజం ప్రాజెక్టుకు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ విజయపురిసౌత్‌లోని మెగా టూరిజం ప్రాజెక్టు భూములను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఇటీవల మెగా టూరిజం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో జేసీ భూములను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గతంలో మెగా టూరిజం ప్రాజెక్టుకు 250 ఎకరాలు అడ్వాన్స్ పొజిషన్ మాత్రమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో భూములు అప్పగించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సాగర్ ప్రాజెక్టు సమీపంలో మరో 20 ఎకరాల భూమిని ఏపీ టూరిజంకు కేటాయించనున్నట్లు వివరించారు. మెగా టూరిజం భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్వరలో అసైన్డ్ భూముల పంపిణీ

జిల్లాలో సుమారు 1,700 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. మాచర్లలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే భూములను సాగు చేసుకుంటున్న కుటుంబాలకు పట్టాలు ఇవ్వనున్నట్లు వివరించారు. మండలంలోని ఏకోనాంపేట గ్రామంలోని 90 ఎకరాల అసైన్డ్ భూములను సర్వే చేయించామని, ఆ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట గురజాల ఆర్డీఓ అద్దెయ్య, మాచర్ల తహసీల్దార్ రమేష్ బాబు, ఆర్ఐ ఫణికుమార్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, టూరిజం మేనేజర్ శ్రీనివాస్, వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దీక్షల విరమణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠం దీక్షల విరమణకు సిద్ధమైంది. మూడు రాష్ట్రాల నుంచి విచ్చేసే భక్తులతో దీక్షా పీఠంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనుంది. మంగళవారం నుంచి సుందరకాండ పారాయణం, మన్యుసూక్త మూలమంత్ర హోమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం సుందరకాండ పారాయణం పూర్తి కాగా గురువారం నుంచి దీక్ష విరమణలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. గురువారం నుంచి 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 13వ తేదీ శనివారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ జరుగుతుంది. తొలుత పీఠం నుంచి దీక్షాదారులు పవిత్ర కృష్ణానదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కలశాలతో నదీ జలాలను తీసుకుని తిరిగి పీఠానికి చేరుకుని స్వామి వారిని అభిషేకిస్తారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా దీక్ష విరమణలు చేస్తారు. 14వ తేదీ హనుమత్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తారు. 15వ తేదీ సోమవారం మహా పూర్ణాహుతితో దీక్షలు, ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. పీఠం ఆవరణలోని యాగశాలలో దీక్ష విరమణల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లతో పాటు ఆలయం వెలుపల చలువ పందిళ్లు సిద్ధం చేశారు. అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపటి నుంచి రంగస్థలి నాటిక పోటీలు



నాటిక పోటీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రంగస్థలి ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి 43వ వార్షికోత్సవం, 23వ ఆహ్వాన నాటిక పోటీలను ఈనెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్టు రంగస్థలి అధ్యక్ష, కార్యదర్శులు షేక్.బాజి, నల్లపాటి బోస్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కపలవాయి విజయకుమార్ తెలిపారు. టౌన్‌హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాటిక పోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రతిరోజు సాయంత్రం 6గంటలనుంచి నాటిక ప్రదర్శనలు, సభా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. తొలిరోజు శుక్రవారం విజయవాడ యంగ్‌మెన్ థియేటర్ ఆర్ట్స్ వారి ఓ క్రైమ్ కథ, పెదకాకాని గంగోత్రి వారి ఆస్తికలు, కరీంనగర్ చైతన్య కళాభారతి వారి చీకటిపువ్వు, 13న శనివారం విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి నిశ్శబ్దమా! నీఖరీదెంత ?, హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి లక్షణ రేఖ దాటితే..?, హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు!, 14న ఆదివారం సికింద్రాబాద్ కె.జె.ఆర్. కల్చరల్ అసోసియేషన్ సాహితీ సూక్తం, తెనాలి కళల కాణాచి అంధ స్వరం నాటికలు ప్రదర్శించనున్నట్టు వివరించారు.

నాణ్యతతో కూడిన పరిష్కార సేవలు..

- 'జగనన్నకు చెబుదాం'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: ప్రతివారం నిర్వహించే స్పందనకు మించి నాణ్యతతో కూడిన పరిష్కార సేవలు అందజేసేందుకే జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో ఎక్కడా వివక్ష, లంచాలకు తావులేకుండా సమయపాలన పాటిస్తూ పరిష్కరించటం జరుగుతుందన్నారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు జగనన్నకు చెబుదామనే కార్యక్రమం అమలుచేస్తున్నామన్నారు. ఈ సమస్యలపై సీఎం కార్యాలయంలోని ఒక ప్రత్యేక బృందం మైక్రో లెవెల్‌లో పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. పరిష్కరించిన తర్వాత ఫిర్యాదుదారునికి ఫోన్ ద్వారా సంతృప్తిచెందారా అనే మెసేజ్ కూడా వస్తుందన్నారు. వారు సంతృప్తి చెందకపోతే సచివాలయం ద్వారాగాని, మళ్లీ 1902 ద్వారా లేదా జగనన్నకు చెబుదాం jkc.ap.jv అనే పోర్టల్‌ద్వారా మళ్లీ ఆ సమస్యను రీఓపెన్ చేస్తారన్నారు. ఉదాహరణకు వీఆర్ఓ స్థాయిలో చేసిన పరిష్కారం నచ్చకపోతే తహసీల్దార్, అదీ నచ్చకపోతే ఆర్డీఓ స్థాయికి వెళుతుందన్నారు. అక్కడ నచ్చకపోతే జాయింట్ కలెక్టర్ లేదా కలెక్టర్ లెవెల్‌కు వస్తుందన్నారు. చివరకు ఆ ఫిర్యాదుదారుడు సంతృప్తి చేందేంతవరకు ఆ సమస్యను విచారించటం జరుగుతుందన్నారు. జిల్లా లెవెల్‌లో సమస్యను పరిష్కరించేందుకు డెప్యూటీ కలెక్టర్ అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పీఎంయు) కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. జిల్లా నుంచి ఎన్ని సమస్యలు వచ్చాయనేది చూసుకొని సమయంలోగా సక్రమంగా పరిష్కారమవుతున్నాయా లేదా అనేది తనిఖీ చేస్తారన్నారు. డివిజన్ లెవెల్, మండల లెవెల్, సచివాలయ స్థాయిలో పీఎంయూలను ఏర్పాటు చేస్తారన్నారు. ప్రజలందరూ ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30 కల్లా నాడు–నేడు పనులు పూర్తిచేయండి...

నరసరావుపేట: మే 30 నాటికి నాడు–నేడు కార్యక్రమం కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల అధికారులు, హెచ్ఎంలు, మున్సిపల్ కమిషనర్లతో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనులకు సంబంధించి సుమారు రూ.28కోట్లు రివాల్వింగ్ ఫండ్ అందుబాటులో ఉందని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పనులను నిధులు సర్దుబాటు ద్వారా పూర్తిచేయాలన్నారు. సంబంధిత ఎంపీడీఓలు, ఎంఈఓలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు వందశాతం పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఈఓ కె.శామ్యూల్, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ఐసీడీఎస్ పీడీ అరుణ, ఎస్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్, ఏపీ విద్యా సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

వ్యవసాయ శాఖ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే



చోడవరంలో ఏఓ శైలజ నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాహుల్ పాండే

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసిన రైతులకు న్యాయం చేస్తామని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్ రాహుల్‌పాండే అన్నారు. చోడవరం గ్రామంలో బుధవారం అధికారులు బృందంతో కలిసి తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి రైతుల వద్ద నుంచి మొక్కజొన్న సేకరిస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌పాండే మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా జొన్న, మొక్కజొన్న, వరి సాగు చేసిన రైతులకు తీవ్ర ఇబ్బందులు వచ్చాయన్నారు. రైతులకు ఆదుకోవటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో పంటల వివరాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మొక్కజొన్న క్వింటా రూ. 1,962 గిట్టుబాటుధర ప్రభుత్వం ఇస్తోందన్నారు. తేమ శాతం తగ్గటానికి తడిచిన మొక్కజొన్న పంటను రైతులు ఎండబెట్టాలన్నారు. బాగా ఉన్న మొక్క జొన్న పంటలో బూజు పట్టిన పంటను కలిపితే నష్టం పెరుగుతుందని, ఈ విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట ప్రభుత్వం కొనుగోలు చేసినట్లే జొన్న పంటను కూడా కొనుగోలు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సమాధానం చెబుతూ త్వరలో ఉన్నత స్థాయిలో సమావేశం ఉందని, జొన్న పంట విషయం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. జేడీ మార్కెటింగ్ శ్రీనివాసరావు, డీఎం మార్క్‌ఫెడ్ మురళీ, ఏడీ మార్కెంగ్ నిత్యానంద, ఏఓ శైలజ పాల్గొన్నారు.

'మత్స్యకార భరోసా'ను విజయవంతం చేద్దాం

- రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున
- ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్సీ తలశిలతో కలిసి సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాల పరిశీలన



సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మేరుగ, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్సీ తలశిల

నిజాంపట్నం: ఈనెల 16వ తేదీ జరిగే మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని విజయవంతానికి కృషిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున కోరారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఈనెల 16వ తేదీ బాపట్ల జిల్లా నిజాంపట్నంకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలి, హెలిప్యాడ్‌కు అనువైన స్థలాలను, వాహనాల పార్కింగ్ స్థలాలను బుధవారం మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌లు పరిశీలించారు. వివిధ ప్రదేశాలను పరిశీలించి హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా నిజాంపట్నం - బాపట్ల రోడ్డులోని ప్రాంతాన్ని ఎంపిక చేశారు. నిజాంపట్నం–రేపల్లె రోడ్డులో నిజాంపట్నం శివారున సభాస్థలి ప్రాంగణాన్ని, వీఐపీ వాహనాలు, సభా ప్రాంగణానికి వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు స్థలాలను ఎంపిక చేశారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 16వ తేదీ మత్స్యకార భరోసాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి 1,23,519 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.123.52 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పటిష్ట బందోబస్తు, హెలిప్యాడ్, సభాస్థలి ప్రాంగణంలో బ్యారికేడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- అవార్డు పొందిన ఎన్‌సీసీ ఆఫీసర్‌కు అభినందనలు తెలిపిన కలెక్టర్


కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఎన్‌సీసీ ఆఫీసర్ రామకృష్ణను సత్కరించి అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: యువతకు ఎన్‌సీసీ ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇచ్చి క్రమశిక్షణ నేర్పుతూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. బుధవారం ఎస్ఎస్ఎన్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ రామకృష్ణరాజును కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ సత్కరించారు. ఇటీవలనే ఆఫీసర్ రామకృష్ణ ఎన్‌సీసీ విభాగం నుంచి డైరెక్టర్ జనరల్ కమాండేషన్ కార్డు అవార్డును పొందారు. దీనిపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన పల్నాడు జిల్లాకు ఈ అత్యుత్తమైన అవార్డు రావటం జిల్లాకే గర్వకారణం అన్నారు. యువత ఎన్‌సీసీలో చేరటం ద్వారా శారీరక, మానసిక, ధైర్యసాహసాలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో ఏ, బీ, సీ సర్టిఫికెట్ల ద్వారా ఎంతో ఉన్నత స్థాయికి చేరవచ్చన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సమాజసేవలైన రక్తదానం, ట్రీ ప్లాంటేషన్, స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల్లో చైతన్యం కల్పించటంలో ముందంజలో ఉండాలన్నారు. అవార్డు పొందిన ఆఫీసర్ రామకృష్ణను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు బత్తుల మురళీ పాల్గొన్నారు.

మెరిసిన ఫణి ఫ్రేమ్

- మోదుకూరు కుర్రోడికి ఫొటోగ్రఫీలో జాతీయ స్థాయి అవార్డు
- ఈనెల 7న హైదరాబాద్‌లో ప్రదానం
- '24 ఫ్రేమ్ ఫొటోగ్రఫీ'తో తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపు


ఇండియన్ ఎమినెంట్ అవార్డును స్వీకరిస్తూ..

తెనాలి: సాంకేతిక నైపుణ్యం.. సృజనాత్మక దృష్టి.. రెండూ అవసరమైన కళ ఫొటోగ్రఫీ. క్షణకాలంలో ముప్పిరిగొనే భావోద్వేగాలను కెమెరా కన్నుతో ఒడిసిపట్టటం అంత ఈజీయేం కాదు. ఇంతటి క్లిష్టమైన ఫొటోగ్రఫీ కళలో అసాధారణ ప్రతిభ చూపారు ఫణి గోగిరెడ్డి. ఈయన తీసే ఫొటోల వరుస, కథను చెబుతాయన్న ప్రశంసలను అందుకున్నారు. ఫొటోగ్రఫీలో తన ప్రత్యేకతతో పలు అవార్డులను, ప్రశంసలను అందుకున్నారు. తాజాగా ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఎమినెంట్ అవార్డు-2023ను స్వీకరించారు.

మూడు పదుల వయస్సులోనే గుర్తింపు

మూడు పదుల వయసులోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపును సాధించిన ఫణి గోగిరెడ్డి స్వస్థలం బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు. పాఠశాల విద్యనభ్యసిస్తున్నప్పుడే ఫొటోగ్రఫీపై ఆసక్తి పెంచుకున్న ఫణి కంప్యూటర్ సైన్స్‌లో డిప్లొమా తర్వాత ఫొటోగ్రఫీ కోర్సు చేశారు. ఆ తర్వాత సినిమా రంగంకేసి చూశారు. అసిస్టెంట్ కెమెరామెన్‌గా వృత్తి జీవితం ప్రారంభమైంది. 'ఎవడు', 'మిస్టర్ నూకయ్య', 'దేనికైనా రెడీ' తదితర పది సినిమాలకు పనిచేశారు. మూడున్నరేళ్ల ప్రముఖ సినీనటుడు, నిర్మాత మోహన్‌బాబు కంపెనీలో కొనసాగారు. ఆ తర్వాత సొంత కంపెనీతో మరో ప్రస్థానం ఆరంభించారు.

24 ఫ్రేమ్స్‌తో ఖ్యాతి

కట్ చేస్తే...24 ఫ్రేమ్స్.. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ప్రసిద్ధ ఫొటోగ్రఫీ సంస్థ ఇది. ఫణి గోగిరెడ్డి సీఈఓగా 2016లో ప్రారంభమైంది. కథను చెప్పే క్షణాలను క్యాప్చర్ చేయగల వందకుపైగా అసాధారణమైన ఫొటోగ్రాఫర్లు/వీడియోగ్రాఫర్ల బృందంతో, అత్యద్భుతమైన పనితీరు, నిబద్ధత, కస్టమర్ల సంతృప్తితో ఆరేళ్ల కాలంలోనే ఈ కంపెనీ ఖ్యాతి ఇనుమడించింది. వెడ్డింగ్ షూట్స్, ప్రీ వెడ్డింగ్ షూట్స్‌లో సంస్థ అగ్రగామిగా నిలిచింది. ప్రతిష్ఠాత్మకమైన పారామౌంట్ కాన్సెప్ట్ ఇన్ ఫొటోగ్రఫీ, కస్టమర్ సపోర్ట్ అవార్డులను గెలుచుకుంది. గత రెండు, మూడేళ్లుగా ప్రసిద్ధ ఫొటోగ్రఫీ కంపెనీ నికాన్ ఇండియాకు అంబాసిడర్‌గా ఫణి వ్యవహరిస్తున్నారు.

తగిన గౌరవం

ఈ క్రమంలోనే వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు ఇన్నోవెక్సియా ఇంటర్నేషనల్ ఏటా ప్రదానం చేసే జాతీయస్థాయి 'ఇండియన్ ఎమినెంట్ అవార్డ్-2023'కు ఫణి గోగిరెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎ.మురళి, మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మి ఠాకూర్ చేతులమీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ప్రొఫెషనల్‌గా, తన క్రాఫ్ట్ పట్ల అచంచలమైన అంకితభావానికి ఈ అవార్డుతో తగిన గౌరవం లభించినట్టయిందని చెప్పవచ్చు.

పరిశ్రమల స్థాపనతో ఉపాధి మార్గాలు అధికం

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తోందని, అధికారులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశం మందిరంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరగా పరిష్కరించాలన్నారు. చిన్న చిన్న లోపాలను, ఇబ్బందులను సరిచేయాలని సూచించారు. పదేపదే కార్యాలయాలకు తిప్పుకోవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను కూడా పారిశ్రామికవేత్తలకు అవగాహన కలిగించాలని చెప్పారు. సింగిల్ డెస్క్ పోర్టల్స్ ఉన్న దరఖాస్తులు అధికారులు సమన్వయం చేసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లాలో 45 పరిశ్రమలకు సంబంధించి 65 క్లెయిమ్స్‌కు రూ.7.60 కోట్లు మంజూరు చేస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ డీఎం విజయరత్నం, డీపీఓ ఆర్.కేశవరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఏ రఘునాథ బాబు పాల్గొన్నారు.



విధులను సమర్థంగా నిర్వర్తించండి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ మహేష్

నరసరావుపేట: విధులను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి నూతన డీఎస్పీకి సూచించారు. నరసరావుపేట నూతన డీఎస్పీగా కేవీ మహేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీని జిల్లా పోలీసు కార్యాలయంలో కలిశారు. నూతన డీఎస్పీకి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. కేవీ మహేష్ 2018 బ్యాచ్‌కి చెందిన వారు కాగా, తొలిసారిగా కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటకు వచ్చారు. సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు నూతన డీఎస్పీని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టాటా మోటర్స్ షోరూమ్ ప్రారంభం


సాహెనీ ఆటో షోరూమ్‌ను ప్రారంబిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేటరూరల్: టాటా మోటర్స్ ఆథరైజ్ డీలర్ సాహెనీ ఆటో నూతన షోరూమ్‌ను చిలకలూరిపేటరోడ్డులో బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ కేవీ మహేష్, టాటా మోటర్స్ జోనల్ మేనేజర్ లక్ష్మీరాంకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. దేశంలో మొట్టమొదటి బయోఫ్యూయల్ వాణిజ్య వాహనం ఇంట్రా వి20ని ఆవిష్కరించారు. ఇంట్రా వి 30 బీఎస్ సిక్స్ ఆర్ డి టు వాహనాన్ని లాంచ్ చేసి ముగ్గురు వినియోగదారులకు అందజేశారు. టాటా మోటర్స్ జోనల్ మేనేజర్ లక్ష్మీ రాంకుమార్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలో 50 సంవత్సరాల అనుభవం ఉన్నట్లు తెలిపారు. వాహనదారుల మన్ననలు పొందే విధంగా కంపెనీ ఉత్పత్తులను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టాటా మోటర్స్ రీజనల్ మేనేజర్ వి.రాజశేఖర్, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి, డాక్టర్ వరబాబు, బంగారు వర్తక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, డాక్టర్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్‌పై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు బుధవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన షాకిరాకు గుంటూరుకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎండీ నూరుల్లాతో 8 నెలల కిందట వివాహం అయ్యింది. రెండు నెలలు బాగానే కాపురం చేశారు. అనంతరం అదనపు కట్నం కోసం భర్త, అతని సోదరుడు సమీఉల్లా, అతని భార్య అప్సనా మరో సోదరుడు షాహిదుల్లా, అతని తల్లి మైమున్నిసా తరచూ అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫుడ్‌కోర్టు ద్వారా నాణ్యమైన భోజనం అందజేయాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్ సూచన


కలెక్టరేట్‌లోని ఫుడ్‌కోర్టులో భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ఫుడ్‌కోర్టు చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఫుడ్ కోర్టు నిర్వాహకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టులో అధికారులతో కలిసి భోజనం చేశారు. ఫుడ్‌కోర్టు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఆర్వో కె.వినాయకం, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహంను పరిశీలిస్తున్న పోలీసులు

దాచేపల్లి : మండలంలోని పొందుగల గ్రామ సమీపంలోని కృష్ణానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంను గుర్తించినట్లు ఎస్‌ఐ శివనాగరాజు బుధవారం తెలిపారు. సుమారుగా 55 నుంచి 60 సంవత్సరాలు వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహంగా గుర్తించామని, శరీరంపై బ్రౌన్ రంగు ఫుల్ డ్రాయర్, పసుపు, నలుపు మొలతాడు ధరించి ఉన్నారని ఆయన చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు దాచేపల్లి సీఐని సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రాణదాత

- అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ
- ప్రమాదంలో గాయపడిన యువకుడు
- బ్రెయిన్ డెడ్ అని నిర్ధారించిన వైద్యులు
- అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు


వల్లుపు శ్రీరాములు (ఫైల్)

తాడేపల్లిరూరల్ : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడు అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. తాను తనువు చాలించినా మూడు కుటుంబాల్లో ఆనందాలు నింపాడు. మణిపాల్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన వల్లుపు శ్రీరాములు(23) సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమావశాత్తు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీరాములుకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో శ్రీరాములు భార్య వసంత, తండ్రి ఏడుకొండలు, తల్లి సుశీల అవయవ దానానికి అంగీకరించారు. కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని, మరొక కిడ్నీని ట్రాన్స్‌ప్లాంటేషన్ నిమిత్తం గుంటూరులోని వేదాంత హాస్పిటల్‌కు తరలించామని వైద్యులు తెలిపారు. అవయవదానానికి ముందుకు వచ్చినందుకు దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.4.50 లక్షల పరిహారం చెల్లించాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ.వెంకట నాగేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన కె.బాపిరెడ్డి వద్ద రామడుగు వెంకటేశ్వర్లు 2016లో రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో 2021 డిసెంబర్ 13న రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏడాది జైలు, ఫిర్యాదు దారుడికి రూ.4.50 లక్షల పరిహారం అందజేయాలని తీర్పు చెప్పారు. నిందితుడు తీర్పుపై జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన తీర్పును యధావిధిగా ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

రాష్ట్ర కాపు జేఏసీ లీగల్ సెల్ చైర్మన్‌గా సత్యనారాయణ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు, బలిజ, తెలగ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్‌గా సీహెచ్‌వీ సత్యనారాయణ(అడిషనల్‌పీపీ)ను ఎన్నుకున్నారు. గుంటూరు నగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు అసోసియేషన్ జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నేడు

గుంటూరు మెడికల్: నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ కింద వైద్య ఉద్యోగాలకు ఎంపికైన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు బుధవారం తెలిపారు. డెంటల్ టెక్నీషియన్, సోషల్‌వర్కర్, సైకాలజిస్టు, మల్టీహ్యాబిలిటేషన్ వర్కర్, ఆడియో మెట్రిషియన్, న్యూట్రీషియన్ కౌన్సిలర్, స్టాఫ్‌నర్సు, హాస్పిటల్ అటెండెంట్, శానిటరీ అటెండెంట్, క్లీనర్, అటెండెంటర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ లిస్టు ఆధారంగా గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫైనల్ మెరిట్ లిస్టు ఆధారంగా 1:3 మెరిట్ కమ్ రూరల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు వివరించారు. అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించామని, ఉద్యోగాలకు ఎంపికైన వారందరూ ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

పేద ఇక రాజాగా


కృష్ణాయపాలెం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు

సీఆర్డీఏ పరిధిలోని ఆర్-5 జోన్‌లో పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన భూముల్లో లే అవుట్ల అభివృద్ధి పనులు చకచక సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొంత అవరోధం కలిగినా తాజాగా రెండు రోజులుగా కాస్తున్న ఎండలతో మళ్లీ పనులు ఊపందుకున్నాయి. ఫలితంగా నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెంలోని సుమారు 550 ఎకరాల్లో 23వేల మంది పేదలకు స్థలాలు కేటాయించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనులను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం హద్దురాళ్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈనెల 17వ తేదీ నాటికి లే అవుట్లలో అన్ని పనులూ పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

– మంగళగిరి


యర్రబాలెం లే అవుట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృశ్యం